139

# డూడూ బసవన్న

ప్రభువుగారికే దణ్ణం బెట్టూ
పాదం వొంచీ దణ్ణం బెట్టూ
చాటెడు గింజలు ఇస్తారంటా
చారెడు రూకలు ఇస్తారంటా
డూ డూ డూ డూ బసవన్న
డూ డూ డూ డూ బసవన్న

నాగరికత రోజు రోజుకూ పెరుగుతున్నది. పెరగవలసిందే! అలా పెరగుతున్నపుడు, కొత్త సంప్రదాయాలు, కొత్త విలువలూ వస్తాయి. ఇలా రావడంతో బాటుగా, పాత ఆచారాలు కొన్ని కనుమరుగవుతాయి. అవుతున్నాయి. బొత్తిగా ఆచరణకు పనికిరానివీ, కాలంతో బాటు మారలేనివీ, ప్రయోజనం లేనివీ, మారినా కనుమరుగయినా అంతగా బాధ ఉండదు. కానీ - ఇలాంటి వాటిల్లో అంతో ఇంతో ఉండే అందచందాలు కూడా రూపుమాసి పోతున్నపుడే బాధ వేస్తుంది. అలా క్రమంగా కనుదాటిపోతున్న వాటిల్లో గంగిరెద్దు ఒకటి.

గంగిరెద్దాట చాలా ప్రాచీనమయిందని చెప్పుకోవచ్చు. పరమేశ్వరుడంతటి వారు తన నందిచేత ఈ ఆట ఆడించాడు. మరీ మహాచక్రవర్తులూ, యవన రాజులూ, రాజులూ, దేశమంతా చిత్తువత్తుగా ఉన్న రోజుల్లో ఈ ఆట మరింత దేదీప్యమానంగా ఉండేదేమో! ఎందుకనంటే, అప్పట్లో వెలువడిన పుస్తకాలు చూస్తూ ఉంటే వాటిల్లోని రాకుమారులూ, రాజకుమార్తెలూ ఈ గంగిరెద్దాటలు చూసి ఆనందించిన ఘట్టాలు కనిపిస్తాయి. ప్రారంభంలో ఇదొక వినోద క్రీడగా మొదలయినా, రాను రాను గంగిరెద్దును ఆడించడం వొక వృత్తిగా మార్పు చెందింది. ఇప్పుడా వృత్తికి తిలోదకాలివ్వవలసి వచ్చిందంటున్నాడు బసవయ్య.

బసవయ్యది - చాలా పెద్ద కుటుంబం. ఆరుగురు అన్నదమ్ముల్లోనూ పెద్దవాడు. తండ్రి వెంట ఊరూరూ తిరగడం, తండ్రిని గమనిస్తూ ఉండడం, ఆయన మాటల్నీ పద్ధతుల్నీ అనుసరిస్తూ ఉండడంతో, చిన్నతనం నుండీ, ఈ ఆటలోని మెలకువలన్నీ అవగతమయ్యాయి. తండ్రి, "బసవా?" అని కేకవేసి, ఎద్దుచేత ఒక్కో మోళీ వేయిస్తున్నప్పుడు, బసవయ్య ఆ మోళీకి అనుగుణగా 'రాండోలు' వాయించే వాడు.

"దాన్ని వాయించడం కష్టమండీ దొరగారూ! మామూలు డోలు వాయించడమంటే - ఒక చేత్తో డోలును కర్రను పట్టుకొని, మరో చేతి వేళ్ళతో వాయించాలి. రాండోలును వాయించటానికి, రెండు చేతులతోనూ, రెండు కర్రల్ని పట్టుకోవాలి. ఒక పుడకతో డోలు చర్మాన్ని కాపాడుతూ, మరో కర్రతో రెండో వేపున వరసలు వాయించాలి. నాకీ పని చిన్నప్పణ్ణించీ తెలుసునండీ!" అన్నాడు బసవయ్య.

తనూ, తన తండ్రీ తన చిన్నాన్నా కలిసి, అనేక వందల ఊళ్ళు తిరిగామన్నాడు బసవయ్య, తన బాబాయి, శ్రుతిపోస్తూ, రాండోలు వాయించే వాడట. తను సన్నాయి వాయిస్తుంటే, తండ్రి

గంగిరెద్దును ఆడించేవాడు. ఆ రోజుల్లో వారికో పెయ్యదూడ కూడా ఉండేది. అది గొడ్డుమోతు గొడ్డు. ఎద, సూడి వుండేవి కావు. అది సీతమ్మ, గంగిరెద్దేమో రాములవారు. ఆ రెండింటికీ పెళ్ళి జరిగేది.

"పోలేరమ్మ గుడి దగ్గరో, బొడ్డురాయి దగ్గరో గడివేసేవాళ్ళమండి. రెండు మూడు వందల మంది దాకా, చుట్టూ చేరేవారు. ఎద్దు చేత రకరకాల మోళీలు వేయించేవాడు మా నాన్న. ఆ ఎద్దు ముంగాళ్ళు వంచి, ముందుకు నడుస్తుంది. వెనక్కు జరుగుతుంది. ఒంటికాలితో దణ్ణం పెడుతుంది. 'కాదు' 'అవును' అని తలతో సైగ చేసేది. రాండోలు వాయిద్యానికి అనుగుణంగా గంతులు వేసేది, అలిగేది, కోపగించుకునేది. ఆనందంతో చిందులు తొక్కేది. కోపంతో కాలు దువ్వి, తోక మట్ట ఎగబట్టి, రంకెలు వేసేది. ఏ పని చేయమంటే, ఆ పని సుబ్బరంగా చేసేదండీ" అన్నాడు బసవయ్య.

సాధారణంగా గంగిరెద్దుల్ని కొనడమంటూ జరగదన్నాడు బసవయ్య. తప్పుడు సుడులున్న గిత్తల్నీ, పొగరుమోతు వాటినీ, పోట్ల కోడెల్నీ ఈ గంగిరెద్దుల వాళ్ళకు ఇస్తూ ఉండే వారుట. ముగుదాడు వేసీ, మూతికి చిక్కంగట్టి కాళ్ళకు బంధాలు వేసి దాన్ని అంకెకు తెచ్చేవారుట. ఒక్కోగిత్త, మూడు నాలుగు మాసాల కల్లా, విద్యలన్నీ నేర్చుకొంటే, మరొకదానికి నేర్పడానికి ఏడెనిమిది మాసాలు కూడా పడుతుందన్నాడు బసవయ్య.

"ముందుగా వినవండీ! దాన్ని సాదికలోకి తీసుకురావడం చాలా కష్టం! ఆట నేర్పేటప్పుడు-కొట్టక తప్పదండీ! నేర్చుకొన్న తరువాత కూడా వొక్కోసారి మొరాయించి, మా పరువు తీస్తుందండీ!" అన్నాడు బసవయ్య.

ఆ రోజుల్లో, ఒక్కో ఊళ్ళో మూడేసి రోజులు మకాం వేస్తుండే వాళ్ళమనీ, ఊరి బయట, ఏ చెట్టుకిందనో ఉడకేసుకు తింటూ ఉండేవాళ్ళమనీ, ఏ రైతు కొట్టం దగ్గర కెళ్ళినా, ఎద్దు మేతకు కరువుండేదికాదనీ చెప్పుకొచ్చాడు బసవయ్య.

"పోటీలు పడి ఆడించే వాళ్ళు బాబయ్యా! పాత పంచెలు, ఉత్తరీయాలు, చొక్కాలు, చీరెలు, రవికెలు, మూటెడు దొరికికేవి. గంగిరెద్దుకీ, ఆవుకూ మేతా, దాణా - ఊరివాళ్ళు పోటీలమీద పంపించేవారు... క్రమంగా చూస్తూ చూస్తూ ఉండగానే ఆ కాలం కళ్ళముందే దాటిపోయిందండీ! బస్తీల మొఖం చూసి, ఎన్నేళ్ళయిందోనండీ! మరీ మారుమూల పల్లెటూళ్ళను పట్టుకుని వెళ్ళాడుతున్నాం ఇదివరకు, చాటల్తో గింజలు పెట్టేవాళ్ళు. ఇప్పుడు గుప్పెళ్ళతో వేస్తున్నారు. లేదా 5 పైసలో 10 పైసలో పడేస్తున్నారు. నా తమ్ముళ్ళందరూ కూలిపనో, నాలిపనో చేసుకుంటున్నారు. ఇదిగో నేనూ, మా లింగమయ్యా మాత్రం ఇంకా బసవదేవుల్ని నమ్ముకొని బతుక్కొస్తున్నాం... అసలు మాదేవూరో. పొట్టచేత పట్టుకొని, ఊరూరా తిరిగే వాడికొక ఊరంటూ ఉంటే గడుస్తుందా బాబూ! ఏ ఊరు పచ్చగా ఉంటే అదే నా వూరు. ఎక్కడ ధర్మ ప్రభువులుంటే, అదే నా వూరు." అన్నాడు బసవయ్య!

బసవయ్యకు ఐదుగురు పిల్లలు. పెద్దవాడు, తన రెండో తమ్ముడి దగ్గర ఉంటున్నాట్ట. మిగిలిన నలుగురూ, తనతోబాటే ఊరూరా తిరుగుతుంటారట.

"ఈ విద్య నాతోనే ఆఖరుసార్!" అన్నాడు బసవయ్య గంగిరెద్దు గంగడోలును ఆప్యాయంగా నిమురుతూ. అలా అంటున్నప్పుడు అతని కళ్ళు నీటితో నిండిపోయాయి!